క్లుప్తంగా

కాపు సంక్షేమ సేవ అధ్యక్షుడిగా భీమాల



భీమాల శ్రీనివాసరావు

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గ కాపు సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడిగా గణపవరానికి చెందిన భీమాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పులి శ్రీరాములు పంపిన నియామక పత్రాన్ని ఆయన విలేకరులకు చూపించారు. నియోజకవర్గంలో కాపు కులస్తుల ఐక్యతకు, సంక్షేమానికి కృషి చేస్తానని, ఈనెలాఖరులోగా గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల కమిటీలు ఏర్పాటు అనంతరం గ్రామ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

దోమల నివారణతో మలేరియా దూరం



గణపవరంలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: మలేరియా, డెంగీ తదితర వ్యాధులకు దోమల నియంత్రణతో దూరంగా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. బుధవారం గణపవరంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు మలేరియా వ్యాప్తి, కారణాలు, లక్షణాలు, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జ్వరం వస్తే తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధిని గుర్తిస్తే చికిత్స పొందాలని సూచించారు. ఇంటి ఆవరణ, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి, సీమెచ్ఓ జాలాది విల్సన్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోడి వ్యర్థాలతో వ్యాన్ స్వాధీనం

భీమడోలు: ఏలూరు పరిసర ప్రాంతాల్లోని కోడి మాంసం దుకాణాల వద్ద నుంచి సేకరించి వ్యర్థాలను కొల్లేరు ప్రాంతాలకు తరలిస్తున్న ఓ వ్యాన్‌ను పోలీసులు కురెళ్లగూడెం వద్ద బుధవారం పట్టుకున్నారు. వ్యాన్‌లోని టన్ను కోడి వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన భలే సుబ్బరాజు, భలే నరేష్ అనే వ్యక్తులు కోడి వ్యర్థాలను కొల్లేరు గ్రామాలకు తరలిస్తున్నారు. ఎస్సై వై.సుధాకర్‌కు వచ్చిన సమాచారం మేరకు కురెళ్లగూడెం వద్ద వాహనాన్ని ఆపి వ్యర్థాలను తరలిస్తున్నట్లు నిర్ధారించారు. వారిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు.

కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం



అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి

టి.నరసాపురం: టి.నరసాపురం అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో కొలువైన అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మద్ది అంజన్నకు పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని బుధవారం ఆంధ్రప్రదేశ్ ఏసీబీ హెడ్ కోటర్స్ ఎస్పీ సుప్రజ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో ఎస్పీకి స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు అనంతరం అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని ఎస్పీ సుప్రజకి ఈఓ అందజేశారు.

వినాయక స్వామి ఆలయంలో అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత స్వామి వారికి నైవేద్యంగా చక్కెర పొంగలి, పులిహోర, రెండు రకాల కూరలు, సాంబారు, పెరుగు, అన్న ప్రసాదం సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుమారు 1,100 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ప్రతి నెలా మొదటి బుధవారం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్ రెడ్డి, చల్లా వరప్రసాద్, కల్లూరి మురళీకృష్ణ, శ్రీధరాల శ్రీనివాస వెంకట గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో ఉపశమనం

భీమడోలు: రోజంతా ఉక్కపోత, రాత్రి భారీ వర్షం కురవడంతో ప్రజలంతా ఉపశమనం పొందారు. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, కురెళ్లగూడెం, అంబర్‌పేట, పోలసానిపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులపై వాహనాల రాకపోకలు లేక వెలవెలబోయాయి. జూన్ నెల వచ్చినా వర్షాలు కురవకపోవడం, విపరీతమైన ఎండతో ప్రజలంతా నానా అవస్థలు పడుతున్నారు. వరుణుడు రాక కోసం ప్రజలు, రైతులు ఎదురు చేస్తున్నారు. ఒక్కసారిగా బుధవారం సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణమంతా చల్లబడడంతో ఉపశమనం పొందారు. పలు రహదారుల గోతుల్లో నీరు నిలిచిపోయాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా ఎన్నికల నియమావళిలో భాగంగా ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు ముందుస్తు చర్యల్లో భాగంగా భీమడోలు వారపు సంతను సాయంత్రం ఆరు గంటల తర్వాత ముగించారు.



జాతీయ రహదారి సూరప్పగూడెం వద్ద రాకపోకలు లేని ఫ్లైవర్



భీమడోలు జంక్షన్‌లో కురుస్తున్న భారీ వర్షం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

భీమడోలు: పర్యావరణ పరిరక్షణతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వేసవి విజ్ఞాన తరగతులు ఉల్లాసంగా నిర్వహించారు. చిన్నారులకు నీతి కథలు చెప్పి, వారితో నీతి కథలను వల్లించారు. సామూహిక పుస్తక పఠనం చేశారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ చిన్నారులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచి మొక్కలు నాటితే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగిస్తే భవిష్యత్తులో తీవ్ర దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎక్కువగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమదోలు లైబ్రరీలో పర్యావరణ దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తుమ్మల ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్

దాడులకు పాల్పడటం తగదు

దెందులూరు: కౌంటింగ్ అనంతరం కొవ్వలి, శ్రీరామవరం, జోగన్నపాలెం, ఇతర గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటికి వెళ్లి దాడి చేయడం సరికాదని, గ్రామాల్లోని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఒకసారి ఒకరికి విజయం, మరొకరికి పరాజయం రావడం సహజమన్నారు. గతంలో తమకు విజయం లభించినప్పుడు ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేయడం, ఇళ్లకు వెళ్లి కొట్టడం ఇలాంటి సంఘటనలు ఏవీ చేయలేదన్నారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు మామ వైఎస్సార్‌సీపీ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీపై దాడి చేసి కొట్టడం పట్ల జెడ్పీటీసీ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో దాడులు, దౌర్జన్యం వంటి విధానం మానుకోవాలని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- వాడవాడలా మొక్కలు నాటే కార్యక్రమాలు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం వాడవాడలా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్ క్రాస్ కార్యాలయ ఆవరణలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రకరకాల కాలుష్యాల కారణంగా భూతాపం రోజురోజుకీ పెరిగిపోతోందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించడం, సోలార్ విద్యుత్ వినియోగం, భూమికి హాని కలిగించే ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు ఉపయోగించడం వల్ల కొంతవరకు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు ఎం చక్రవర్తి, రెడ్ క్రాస్ వలంటీర్లు ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, కె.శ్రీనివాస్, పి.హర్ష, సుధీర్, గౌతమి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శాంతి నగర్‌లో..

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శ్రీ శివ కరణ్ సింగ్ స్వామీజీ వారి పాదయాత్రలో భాగంగా శాంతినగర్‌లోని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కర్ గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామీజీ స్వయం సేవకుల సమక్షంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం, ప్రకృతికి అనుగుణంగా జీవించడం మానవజాతికి శ్రేయస్కరమని తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ముఖ్యమైన వేడుకలు సందర్భంగా మొక్కలు నాటడం ఒక ఆనవాయితీగా అలవాటు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్వయం సేవకులు జి.వెంకట్రామయ్య, కొండేటి రమేష్, వి.వాసుదేవ్, ఎం పవన్, శ్రీచరణ్, రెడ్డి శ్రీనివాస్, అప్పారావు, తేజోమూర్తి, అన్నందాస్ కృష్ణ, చేకూరి గణపతి, మేకల శ్రీకృష్ణ దేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

పుష్పలీలా నగర్‌లో..

స్థానిక పుష్పలీలానగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఏలూరు సీడీపీఓ ఎ.పద్మావతి మొక్క నాటారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం గురించి చిన్నారులు, తల్లిదండ్రులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే ఆటపాటల ద్వారా విద్యను తల్లిదండ్రులకు తెలియజేశారు. పిల్లల శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో అవసరమని వివరించారు. ప్రతి నెలా ఐదో తేదీన ఈసీసీఈ డే కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్ వైజర్ బి.మంగ, అంగన్‌వాడీ కార్యకర్త ఆర్ జయశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ప్రాంగణంలో..

ఏలూరు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో రైల్వే అధికారులు, ఏపీ పొల్యూషన్ బోర్డు అధికారుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత రైల్వే ఆసుపత్రి ప్రాంగణంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, రైల్వే మెడికల్ ఆఫీసర్ మామిళ్ల పల్లి నానాజీలు మొక్కలు నాటారు. మన భూమి.. మన భవిష్యత్ అనే కార్యక్రమం నిర్వహించారు. జీవితంపై ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలను నాటారు. మిషన్ లైఫ్ గురించి రైల్వే ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైల్వే ప్లాట్ ఫారమ్‌లపై తినుబండారాలు అమ్మే వారికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే వివిధ శాఖల అధికారులు, సూపర్ వైజర్‌లు, సిబ్బంది, వ్యాపారులు, ప్రయాణికులు, ఏపీ పొల్యూషన్ బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో పర్యావరణ దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏలూరు ఉప విద్యాశాఖాధికారి ఎ.రవిప్రకాష్ పిలుపునిచ్చారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేతర అజయ్ బాబు అధ్యక్షతన స్థానిక పీడీబీటీ హైస్కూల్, జూనియర్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవిప్రకాష్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు, జీవనశైలికి ప్రాణాధారం గాలి, నీరు అని తెలిపారు. వాతావరణ అసమతౌల్యత కారణంగా పర్యావరణ, కాలుష్య సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వాలకు తోడు కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు, సామాన్యులు పర్యావరణాన్ని పరిరక్షించడానికి తమవంతు కృషి చేయాలని సూచించారు. మానవత మండల చైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ మానవాళి మనుగడకు చెట్లు ముఖ్యమని తెలిపారు. వర్షాలు లేకుంటే అంతా దుర్భిక్షంగా మారుతుందని, భూతాపాన్ని తగ్గించడానికి, పుడమి తల్లిని కాపాడుకోవడానికి చేయిచేయి కలిపి మొక్కలు నాటడం మనందరి సామాజిక బాధ్యత అన్నారు. ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి విద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన పెంచాలన్నారు. హెచ్ఎం ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ పచ్చని మొక్కలు ప్రకృతి పర్యావరణాన్ని రక్షించే కవచాలని, వీటిని కాపాడుకోవడం మన బాధ్యతని అన్నారు. సమాజ సేవకులు అల్లం వెంకట సుబ్బారావు అనారోగ్యానికి గురి కావడంతో ఆయన వైద్య ఖర్చు నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. మరో పేద విద్యార్థికి సైకిల్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ కార్యాలయం ఆవరణలో మొక్క నాటుతున్న బీవీ కృష్ణారెడ్డి



శాంతి నగర్‌లో మొక్కలు నాటుతున్న శివకరణ్ సింగ్ స్వామీజీ



పుష్పలీలా నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మొక్క నాటుతున్న సీడీపీఓ పద్మావతి



రైల్వే స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న అధికారులు



ఏలూరు రైల్వే స్టేషన్ వద్ద పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు, సిబ్బంది



విద్యార్థినికి సైకిల్ అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

ఓటమిపై గ్రామీణ ఓటర్లలో అనుమానం



నాడు వెంకట రమణ

భీమడోలు: ఎన్నికల ఫలితాలను గ్రామీణ ప్రాంత ఓటర్లు అనుమానిస్తున్నారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాడు వెంకట రమణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తామెంతో లబ్ధి పొందామని, మళ్లీ సీఎంగా జగన్‌ను చూడాలని గ్రామీణులంతా వైఎస్సార్ సీపీకే ఓట్లేసినా పార్టీ ఓడిపోవడంలో ఈవీఎలు, అధికారుల పాత్ర ఉందేమోనన్న అనుమానం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలు గ్రామాల్లో పర్యటించి పార్టీ అభిమానులు, నాయకులతో ఓటింగ్ సరళి, పార్టీ ఓటమిపై చర్చించినట్టు చెప్పారు. ఈ చర్చల్లో గ్రామీణ ఓటర్లలో పలు అనుమానాలు వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని, తాము వేసిన ఓట్లు ఏటూ వెళ్లి పోయాయని వారంతా అనుమానం వ్యక్తం చేస్తున్నారని చెప్పా రు. ఈ ట్యాంపరింగ్ వల్లే రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు భారీ మెజార్టీలు వచ్చాయని, పలు చోట్ల పోలైన ఓట్లకన్నా కౌంటింగ్‌లో ఎక్కువగా చూపి అధికమెజార్టీలు చూపడం దారుణమని అన్నా రు. ఏదేమైనా గ్రామీణ ఓటర్లలో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు పార్టీ అధినాయకత్వం తగు న్యాయపోరాటం చేయాలని కోరారు.

శివయ్యకు విశేష అభిషేకాలు



ద్వారకాతిరుమలలో శివుడు

ద్వారకాతిరుమల: క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శివదేవునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి అర్చకులు, పండితులు ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దయ్యింది.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో నివాసం ఉంటున్న నాగనబోయిన కృష్ణవేణి W/o సుబ్బారావుకు చెందిన వ్యవసాయ భూమి 478/1 సర్వే నంబర్ 0.50 సెంట్లు ఒరిజినల్ దస్తావేజు, సెటిల్ మెంట్ డీడ్ నెం. 147/22.01.2000, సెటిల్‌మెంట్ డీడ్ ఒరిజినల్ ఈ జూన్ 1వ తేదిన ఇంటి వద్ద నుండి ఇ.సి తీయించుటకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళు చుండగా పోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియపరచగలరు. 97042 10688

ఎన్ఎంఎంఎస్‌కు కొవ్వలి హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



పి.లాస్య మనోజ్ఞ



ఎన్.రవళి



అల్లు మేఘనాథ్ సాయి



పుట్టి నాగ దివ్య



గోరిపర్తి పూజిత



గొల్ల పూజ లక్ష్మీకాంతం



కట్టా పవన్ శివసాయి



అంగడాల రాజేశ్వరి



జాజుల ధన సాయి సిరి



కాలి రాజ్‌కుమార్



ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, హెచ్ఎం

దెందులూరు: కొవ్వలి హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభను కనబరిచారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ మాట్లాడుతూ కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులు 10 మంది జిల్లా స్థాయిలో ఏ పాఠశాల సాధించని విధంగా జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారన్నారు. డిసెంబర్ 2023లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 14మంది హాజరుకాగా, 10మంది ఎంపిక కావడం జిల్లాలోనే ప్రథమ పాఠశాలగా రికార్డు సాధించారన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థుల తల్లితండ్రులు శిక్షణ, ప్రోత్సాహం, పర్యవేక్షణతో తమ పాఠశాల విద్యార్థులు 10 మంది ఎంపిక కావడం పాఠశాల హెచ్ఎంగా తనకు ఎంతో సంతోషంగా ఉందని ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ అన్నారు. ఏ రంగంలోనైనా నిరంతర సాధన ప్రణాళిక, క్రమశిక్షణతోనే ఎంచుకున్న రంగంలో 100 శాతం ఫలితాలు లభిస్తాయని హెచ్ఎం శర్మ అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గణపవరం): కైకరం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల నిర్వహణ నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాదవ ప్రజాప్రతినిధులకు అభినందనలు

ఏలూరు (టూటౌన్): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది మంది యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం పట్ల ఏలూరు జిల్లా, ఏలూరు నగర యాదవ సంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఏలూరు పార్లమెంటు నుంచి పుట్టా మహేష్‌యాదవ్, ఎమ్మెల్యేలుగా పల్లా శ్రీనివాసరావు (గాజువాక), పి.వంశీకృష్ణ శ్రీనివాస్ (విశాఖ దక్షిణం), యనమల దివ్య (తుని), కొలుసు పార్థసారథి (నూజివీడు), ఎంఎం కొండయ్య యాదవ్ (చీరాల), సత్యకుమార్ యాదవ్ (ధర్మవరం), పుట్టా సుధాకర్ యాదవ్ (మైదుకూరు)లకు యాదవ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ నుంచి ప్రథమ యాదవ నాయకుడిగా పుట్టా మహేష్ చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులు అందరికీ ఇది గర్వకారణమని తెలిపారు. ఏడుగురు యాదవ ప్రముఖులు ఎమ్మెల్యేలుగా గెలుపొందడం సంతోషదాయకమన్నారు. అభినందనలు తెలిపిన వారిలో జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, ప్రధాన కార్యదర్శి గొర్ల రామారావు, కోశాధికారి చిట్టిబోయిన సాయిబాబు, ఆకుల గంగాధర్, బొట్టా అజయ్ కుమార్, బోగా రాజేష్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వానికి ఎన్‌జీవోస్ అభినందనలు

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి పార్టీలకు అభినందనలు తెలుపుతున్నట్టు ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎన్‌జీఓ కార్యదర్శి నెర్సు రామారావు మాట్లాడుతూ గతంలో చేసిన ఆందోళనల్లో ప్రభుత్వ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని అంగన్‌వాడీ, ఆశ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ఎన్‌జీఓల తరుపున ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు, ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపారు.